**1-36**

**మున్నుడి**

లలితంగా వేంకటరమణుని లలనను కీర్తిస్తున్నారు అన్నమయ్య. ఎన్నిసార్లు విన్నా ఎన్నిసార్లుపాడినా తనివితీరని సుధావాహిని ఈ అమ్మవారి సంకీర్తన. సంగ్రామ లక్ష్మి అని నుతిస్తూ సత్యభామ నీలవర్ణుని రధంపై వీరవిహారం చేసి నరకుని నరకటాన్ని గుర్తుచేస్తున్నారు. చంద్రసహోదరని, బ్రహ్మాదులకు కల్పవల్లి అనీ, గోవిందుని తోడునీడ అనీ, వేదసన్నుత అనీ, వేంకటేశ్వరుని వెలది అనీ నిధుల నిధానమనీ, దేవిని స్వామి ఉరమును ఆక్రమించిన తల్లిగా కీర్తిస్తున్నారు. ఇంకా ఏం చెప్పను?

కం॥ **జయముల నొసగే తల్లిని**
**నయముగ తానన్నమయ్య నళినిని గొలిచెన్**
**ప్రియయని వేంకటవిభునికి**
**జయలక్ష్మిని యిటునుతించె సంగ్రామ సిరిన్**

**రాగం : లలిత**

జయలక్ష్మి వరలక్ష్మి సంగ్రామ వీరలక్ష్మి
ప్రియురాలవై హరికి బెరసితివమ్మ ॥జయలక్ష్మి॥

పాలజలనిధిలోని పసనైన మీగడ
మేలిమి తామరలోని మించు వాసన
నీలవర్ణునురముపై నిండిన నిధానమవై
ఏలేవు లోకములు మమ్మేలవమ్మ ॥జయలక్ష్మి॥

చందురుతోడ బుట్టిన సంపదల మెఱుగవో
కందువ బ్రహ్మలగాచే కల్పవల్లివో
అందిన గోవిందునికి అండనే తోడునీడై
వుందానవు మాయింటనే వుండవమ్మ ॥జయలక్ష్మి॥





పదియారు వన్నెల బంగారు పతిమ
చెదరని వేదముల చిగురుబోడి
ఎదుట శ్రీవేంకటేశు నిల్లాలవై నీవు
నిధుల నిలిచే తల్లి నీ వారమమ్మ ॥జయలక్ష్మి॥

**భావామృతం**

అమ్మా! జయలక్ష్మి! వరలక్ష్మి దేవీ! యుద్ధరంగంలో వీర విహారం చేసే సంగ్రామ లక్ష్మి! నీవు శ్రీమన్నారాయణునకు ప్రియురాలవై అవతరించినావు (సత్యభామగా భావన)

నీవు పాలసముద్రమునుండి వెలువడిన పసందైన మీగడవు తల్లీ! శ్రేష్ఠమైన పద్మము యొక్క పరిమళము కూడ నీవే. నీలమేఘచ్ఛాయతో మెరిసిపోయే శ్రీహరి వక్షస్థలమును ఆక్రమించిన సౌభాగ్యలక్ష్మివి. లోకములనన్నింటిని పరిపాలించు దానివి. అందుచేత మమ్ముకూడా పరిపాలించుము తల్లీ!

దేవదానవులు క్షీరసాగరమును మధించినప్పుడు చంద్రునితో పాటు పుట్టి సంపదలన్నింటికీ నీవే సామ్రాజ్ఞివైనావు. బ్రహ్మాదులను రక్షించే కల్పవల్లివై గోవిందునకు తోడు నీడవు అండదండవూ అయి ఉన్నదానవు. మాగృహమున స్థిరపడు తల్లీ!

పదహారు వన్నెలు గల (నేటి కాలంలో 24 కారెట్లు) బంగారు బొమ్మవు తల్లీ! నీవు స్థిరముగా వేదములన్నింటిలోను కీర్తింపబడిన కుసుమపేశలవు. మా ఎదుట ఇలవేల్పుగా వెలసిన శ్రీవేంకటేశ్వరుని అర్ధాంగివై నీవు నవనిధులని కీర్తింపబడే ఆ సంపదలకు ఆస్థానమై వున్నదానవు. ఓ జగజ్జననీ! మమ్ము మరువకు తల్లీ! మేము పరాయివారముకాము. నీ వారమే నమ్మా!